క్లుప్తంగా

జూరాల వద్ద తాత్కాలిక పార్కింగ్



అమరచింత: జూరాల ప్రాజెక్టు ఎడమ కాల్వ సమీపంలోని నీలగిరి చెట్ల వద్ద ఉన్న ఖాళీ స్థలంలో వాహనాలు నిలిపేందుకు తాత్కాలికంగా వాహనాల పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ సురేష్ కుమార్ తెలియజేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు సీఐ శివకుమార్ నేతృత్వంలో తాత్కాలిక పార్కింగ్ పనులు చేపట్టినట్లు చెప్పారు. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద నీరు వచ్చి చేరుకోవడంతో క్రస్టుగేట్లను ఎత్తి వరద నీటిని దిగవకు వదులుతున్న దృశ్యాలను చూసేందుకు వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తున్న క్రమంలో ప్రాజెక్టుపై ట్రాఫిక్ జాం కలుగకుండా నివారణ చర్యలు చేపడుతున్నారు. ముళ్లపొదలను తొలగించి వాహనాలను నిలిపే ఏర్పాట్లను చేస్తున్నట్లు చెప్పారు.

భక్తిశ్రద్ధలతో కొడిపీర్ల ఊరేగింపు



ఆత్మకూర్: పట్టణంలోని రాజవీధిలో కొలువుదీరిన కొడిపీర్ల ఊరేగింపు భక్తిశ్రద్ధలతో కొనసాగింది. స్థానిక కోట వీధిలోని మసీదులో ఇమామే మౌలాలీ, ఇమామే జలాలి, ఇమామే ఖాసీం, హుస్సేనిఆలం, ఇమామేహుస్సేన్ ఆలంను ప్రతిష్ఠించారు. శనివారం గౌస్‌సాహెబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పెద్ద ఎత్తున గంధోత్సవం నిర్వహించారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం

వనపర్తిటౌన్: ఎస్సీ కార్పొరేషన్ నుంచి దళితులకు అత్యధిక రుణ సదుపాయం కల్పించేందుకు వనపర్తికి అధిక ప్రాధాన్యత ఇచ్చేలా చొరువ చూపాలని ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, సోషల్ మీడియా అసెంబ్లీ కో–ఆర్డినేటర్ డి.వెంకటేష్, ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ప్రీతంను కోరారు. ఈ మేరకు నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రీతంను శనివారం హైదరాబాద్‌లోని ఆయన ఛాంబర్‌లో కలిసి సన్మానించారు. అనంతరం వినతి పత్రం అందజేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దళితులను మాయమాటలతో వంచించి ఆర్థిక తోడ్పాటుకు సహకరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పవన్ కుమార్, బిక్షపతి, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన కార్యదర్శికి..

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని జానంపేటలో పంచాయతీ కార్యదర్శిగా కార్తిక్ సుదీర్ఘ కాలం పాటు పనిచేసి, ఇటీవల బదిలీపై వెళ్లారు. బదిలీ అయిన అతడికి, నూతనంగా వచ్చిన కార్యదర్శి బాలశేషుకు శనివారం గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. ఉమ్మర్ ఫరూక్, నరసింహయాదవ్, రవీందర్, విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడికి..

కొత్తకోట రూరల్: పెద్దమందడి జెడ్పీహెచ్ఎస్‌లో తెలుగు పండింట్‌గా 14 సంవత్సరాలుగా పనిచేసిన ఉపాధ్యాయుడు బి.గిరిజాచారి ఇటీవల జరిగిన సాధారణ బదిలీలో భాగంగా చిట్యాల జెడ్పీహెచ్ఎస్‌కు బదిలీ అయ్యాడు. శనివారం పెద్దమందడి జెడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు బి.గిరిజాచారికి వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి శాలువాలతో సన్మానించారు. హెచ్ఎం శాంతన్న, కురుమూర్తి, సుదర్శన్‌గౌడ్, జగదీస్ బాబు, సాయిచందర్‌రెడ్డి ఉన్నారు.

ఉరేసుకుని బాలిక మృతి

గోపాల్‌పేట: ఉరేసుకుని బాలిక మృతిచెందిన సంఘటన రేవల్లి మండలంలోని గొరిదేవిపల్లిలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గొరిదేవిపల్లికి చెందిన బాలయ్యకు ఇద్దరు మగ పిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. పెద్ద కుమార్తె(17) ఇటీవల నాగర్‌కర్నూల్‌లో ఇంటర్ పూర్తి చేసింది. శనివారం తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లారు. సాయంత్రం తిరిగి వచ్చేసరికి ఇంటి వద్ద ఉన్న స్నానాల గదిలో ఉరేసుకుని కనిపించింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఇదే విషయమై రేవల్లి ఎస్ఐ రామును వివరణ కోరగా.. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని సమాధానమిచ్చారు.

మార్కెట్ గోదాం నిరుపయోగం

- రూ.5 కోట్లు ఖర్చు చేసి వదిలేశారు
- మందుబాబులకు అడ్డాగా మారిన గోదాం
- స్పందించని అధికారులు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

వీపనగండ్ల: రైతుల ప్రయోజనాల కోసం నిర్మించిన వ్యవసాయ గోదాం మూడేళ్లుగా నిరుపయోగంగా ఉంది. అధికారులు ఎవ్వరూ పట్టించుకోవడం లేదని, ఉన్నత స్థాయి అధికారులు స్పందించి అవసరమైన చర్యలు చేపట్టాలని మండలంలోని రైతులు కోరుతున్నారు.

● రైతులు పండించిన పంటలను ఆరబెట్టుకునేందుకు అనువుగా ఉండాలనే సదుద్దేశంతో రూ.5 కోట్లు ఖర్చు చేసి 5 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న వ్యవసాయ గోదాంను కొల్లాపూర్ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్మించారు. మార్కెట్ గోదాం ఆవరణలో పంటలను ఆరబెట్టుకునేందుకు అవసరమైన ప్లాట్‌ఫారాలను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. 2018 ఫిబ్రవరిలో ఆనాటి మార్కెటింగ్ శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మార్కెట్ గోదాంను ఆర్భాటంగా ప్రారంభించారు. కాని నేటికీ ప్లాట్ ఫారాలు నిర్మించకపోవడంతో రైతులకు ఎలాంటి ప్రయోజనం కలగడం లేదు.



నిరుపయోగంగా ఉన్న వీపగండ్ల మార్కెట్ గోదాం

మందుబాబులకు నిలయంగా..

మార్కెట్ గోదాంను ప్రారంభించిన తర్వాత మిల్లర్లకు అద్దెకు ఇచ్చారు. మూడు సంవత్సరాలుగా అద్దెకు ఇవ్వకపోవడంతో గోదాంను మందుబాబులు నిలయంగా మార్చుకొని.. మద్యం తాగుతున్నారు. అసాంఘిక కార్యకలాపాలు చోటుచేసుకునే పరిస్థితులు గోదాం పరిసరాల్లో నెలకొన్నాయి. గోదాం ఆవరణలో నిర్మించిన సెక్యూరిటీ గది, బాత్రూంలు నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి గోదాంను వినియోగంలోకి తీసుకురావడంతో పాటు రైతుల పంటలను ఆరబెట్టుకునేందుకు అవసరమయ్యే ప్లాట్‌ఫారాలను నిర్మించాలని మండలంలోని రైతులు కోరుతున్నారు.



మందుబాబులు వదిలేసిన మద్యం సీసాలు

నిధులు కేటాయించాలి..



రైతుల ప్రయోజనం కోసం ఉన్నతాధికారులు ప్లాట్‌ఫారాల నిర్మాణంతో పాటు అసంపూర్తి కంపౌండ్ వాల్ నిర్మాణం కోసం ప్రత్యేక నిధులను కేటాయించాలి. గోదాం నిర్మాణ సమయంలో కొందరు రైతులు తమ పంట పొలాన్ని కొంత ఉచితంగా అందజేశారు. ఆ రైతులకు గోదాం ద్వారా ఉపాధి కల్పిస్తామని ఇచ్చిన మాటను అధికారులు నిలబెట్టుకోవాలి.

– ఎత్తం బాలస్వామి, మాజీ రైతు కమిటీ అధ్యక్షుడు వీపనగండ్ల

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి..



గోదాం పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా ఉంచడంతో అసాంఘిక కార్యకలాపాలను నివారించవచ్చు. పోలీసులు గట్టి నిఘా ఉంచి మందుబాబులను అదుపు చేయకుంటే మహిళా రైతులకు ఇబ్బందులు ఏర్పడే పరిస్థితి నెలకొంటుంది.

– అంజయ్యనాయక్, మాజీ సర్పంచ్ వల్లభాపురం తండా

నిబంధనల మేరకు లీజుకు ఇస్తాం..



5 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న గోదాంను నిబంధనల మేరకు లీజుకు ఇస్తాం. నెలకు రూ.97 వేల అద్దె చెల్లిస్తే గోదాంను ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది. కొల్లాపూర్ మార్కెట్ పరిధిలోని పలు ప్రాంతాల్లోని గోదాంలు ఖాళీగానే ఉన్నాయి. ప్రభుత్వం నిధులు కేటాయిస్తే రైతుల ప్రయోజనాల కోసం అవసరమైన నిర్మాణాలు చేపడుతాం.

– రాములు, మార్కెట్ కమిటీ కార్యదర్శి కొల్లాపూర్

డీఎంకు టీజేఎస్ నాయకుల వినతి



బస్సులకు పవర్ డోర్‌లను ఏర్పాటు చేయాలని డీఎంకు వినతి అంజేస్తున్న నాయకులు

వనపర్తిటౌన్: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో అధిక సంఖ్యలో మహిళలు బస్సుల్లో ఎక్కుతున్నారని డిపో కార్యదర్శి ఎ.కృష్ణయ్య, టీజేఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు జేవీ స్వామి అన్నారు. సీట్లు సరిపోక డోర్‌ల వద్ద నిలబడుతున్నారని, డోర్ లోంచి కిందపడి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బస్సులకు పవర్ డోర్‌లను ఏర్పాటు చేయాలని శనివారం డిపో మేనేజర్ వేణుగోపాల్‌కు వినతి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. డ్రైవర్, కండక్టర్ ఎంత చెప్పినా.. ప్రయాణికులు డోర్ల వద్ద నిలబడటంతో జారి కిందపడి తరుచుగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. ప్రమాదాలపై డ్రైవర్లు, కండక్టర్లపై చర్యలు తీసుకోవడం సరికాదన్నారు. ఆత్మకూర్, ఘనపురం, మహబూబ్‌నగర్ రూట్లలో టైమింగ్స్ సరిచేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రీజియన్ సహకార కార్యదర్శి ఎండీ. ఖయ్యూం, డిపో ప్రచార కార్యదర్శి సి.నాగేశ్వర్, గోవర్ధన్, ఏజీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ప్రయోగాలు



ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా కుండలు వినియోగించాలని..



చంద్రయాన్ తయారీ విధానం

మదనాపురం: జెడ్పీహెచ్ఎస్ మదనాపురంలో శనివారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆరో తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులు ఈ ప్రదర్శనలో పాల్గొని వినూత్నమైన 35 సైన్స్ ప్రయోగాలు నిర్వహించారు. చంద్రయాన్– 3, విష సర్పాల నుంచి రైతును రక్షించే టార్చ్‌లైట్, వ్యర్థ పదార్థాలతో పండ్లను సులభంగా కోసే పరికరం, రాకెట్ ప్రయోగం, మైక్రోస్కోప్ తయారీ, పీడనంతో పనిచేయు యంత్రాల తయారీ, మానవుడి దేహం భాగాల మోడల్, అగ్ని పర్వతం బద్దలవ్వడం, విద్యుత్ ఉత్పత్తి తయారీ తదితర సైన్స్ ప్రయోగాలను విద్యార్థులు ఎంతో ఉత్సాహవంతంగా నిర్వహించారు. అనంతరం సైన్స్ ప్రయోగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జూనియర్ విభాగం నుంచి, సీనియర్ విభాగం నుంచి మొదటి మూడు స్థానాల్లో బహుమతులను ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు సుదర్శన్‌రావు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ, ఈశ్వర్‌లాల్, నరసింహ, రామకష్ణ, కల్పన, రామచంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యం..



తిప్దంపల్లిలో మాట్లాడుతున్న బంగ్ల లక్ష్మీకాంత్‌రెడ్డి

ఆత్మకూర్: స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని, సత్తా చాటేందుకు బీజేపీ నాయకులు సిద్ధంగా ఉండాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని తిప్దంపల్లిలో బీజేపీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యుల పదవులన్నింటిని కైవసం చేసుకునేలా ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఎంపీ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో ఏడుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉండగా.. ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో బీజేపీకి ఒక్క ఎమ్మెల్యే కూడా లేకున్నా.. ఓటర్లు డీకే అరుణను గెలిపించారని గుర్తుచేశారు. ప్రజలకు బీజేపీపై, ప్రధాని నరేంద్ర మోడీపై నమ్మకం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీను, నారాయణ, అశోక్‌జీ, రాము, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని ధర్నా



తాడిపర్తిలో ధర్నా చేస్తుండగా వారితో మాట్లాడుతున్న ఎస్ఐ హరిప్రసాద్

గోపాల్‌పేట: ఆర్టీసీ బస్సు డ్రైవరు నిర్లక్ష్యం కారణంగా ఓ మహిళ ప్రాణాలు కోల్పోయిందని, వారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బస్సు దిగుతూ గాయాలపాలై మృతిచెందిన పెంటమ్మ కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. దాంతో పాటు తాడిపర్తిలో బస్సు స్టాప్ ఏర్పాటు చేయాలని కోరారు. శనివారం మృతిచెందిన మహిళ కుటుంబ సభ్యులతో పాటు తాడిపర్తికి చెందిన గ్రామస్తులు తాడిపర్తిలో ధర్నా చేపట్టారు. దీంతో బస్సులు రోడ్డుపై నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న గోపాల్‌పేట ఎస్ఐ హరిప్రసాద్ వెంటనే తాడిపర్తికి చేరుకుని ధర్నాకు దిగిన వారిని శాంతింపజేసేందుకు ప్రయత్నించారు. గ్రామస్తులు ఆర్టీసీ డీఎం ఇక్కడికి రావాలని డిమాండ్ చేశారు. దీంతో వనపర్తి ఆర్టీసీ డీఎం వేణుగోపాల్ తాడిపర్తికి చేరుకుని ధర్నాకు దిగిన వారితో మాట్లాడారు. మృతిచెందిన వారి కుటుంబానికి ప్రభుత్వం రూ.20లక్షల ఆర్థిక సాయం అందించాలని కోరారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేయగా.. బస్‌స్టాప్ ఏర్పాటు చేసేందుకు గ్రామస్తులు కలిసి లెటర్ రాసి ఇస్తే తగిన చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ పరంగా ఆదుకునేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు.

చలో ఢిల్లీ వాల్‌పోస్టర్ విడుదల



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్ మాదిగ మహాకూటమి నాయకులు

అమరచింత: మాదిగ సంఘాల మహాకూటమి ఆధ్వర్యంలో వచ్చేనెల 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ మాదిగ సంఘాల మహాకూటమి జిల్లా నాయకులు విజయ్ తెలియజేశారు. చలో ఢిల్లీ కార్యక్రమం సందర్భంగా శనివారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ మాదిగ సంఘాల మహాకూటమి రాష్ట్ర కన్వీనర్లు పోకల కిరణ్‌కుమార్, సింగిరెడ్డి పరమేష్ ఆధ్వర్యంలో వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ ఏబీసీడీ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని మాదిగ ధర్మదీక్ష చేపట్టనున్నట్లు చెప్పారు. హక్కుల సాధనకు చలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. చంద్రన్, గోపాల్, కుర్మన్న, శ్రీకాంత్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



ఖిల్లాఘనపురం: మొక్కల సంరక్షణపై పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీఓ వెంకటాచారి అన్నారు. శనివారం మండలంలోని రుక్కన్నపల్లి, సోలీపురం గ్రామాల్లో పర్యటించి, నర్సరీలు, హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలు, తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ముసురు వానలు కురుస్తున్నందున రోడ్ల వెంట, ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటాలన్నారు. గ్రామాల్లో ప్రజలు ఇళ్ల వద్ద నాటుకునేందుకు ఉపయోగపడే పండ్ల మొక్కలను పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవికుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్పీలకు కనీసం వేతనం ఇవ్వాలి



కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలో మహిళా రిసోర్స్(ఆర్పీ)లుగా పనిచేస్తున్న వారికి కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలంటూ.. సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పి.సుఖేశినిని కలిసి వినతి అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్ మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను తమవంతుగా ప్రజల వద్దకు తీసుకెళ్తున్నారన్నారు. మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలు ఇప్పించడంలో, ఆ రుణాలు సకాలంలో చెల్లించేలా ఆర్పీలు పనిచేస్తున్నారన్నారు. ఆర్పీలకు ప్రత్యేక డ్రస్ కోడ్ ఏర్పాటు చేయడంతో పాటు రూ.5 లక్షల ఇన్సూరెన్స్ కల్పించాలన్నారు. వినతి ఇచ్చిన వారిలో ఆర్పీలు జగదీశ్వర్‌రెడ్డి, యాస్మిన్, సౌజన్య, అంజనమ్మ, పద్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.



కృష్ణమ్మ.. పరవళ్ల సోయగం

ప్రియదర్శిని జూరాల ప్రాజుక్టుకు అనుసంధానంగా నిర్మించిన దిగువ జూరాల జలవిద్యుదుత్పత్తి కేంద్రం వద్ద ఉన్న వియ్యర్ వద్ద కృష్ణమ్మ పరవళ్లు కనువిందు చేస్తున్నాయి. శనివారం జూరాల ప్రాజెక్టు నుంచి 44 గేట్లు ఎత్తి 2.92 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువ శ్రీశైలానికి వదులుతుండటంతో జన్‌కో వియ్యర్ వద్ద దిగువకు జాలువారుతున్న కృష్ణమ్మ విశేషంగా ఆకట్టుకుంటుంది.

– ఆత్మకూర్

అబ్దుల్‌కలాంకు ఘన నివాళి



కొత్తకోటలో నివాళి అర్పిస్తున్న కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

కొత్తకోట రూరల్: భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం 9వ వర్ధంతిని శనివారం పట్టణ కేంద్రంలోని గ్రంథాలయంలో కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ పాఠకులతో కలిసి అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. నిరుపేద ముస్లిం కుటుంబంలో పుట్టిన కలాం జీవితం, నేటి తరానికి ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది ఎండీ.తాజ్, ఆశన్న, బాల్‌రెడ్డి, రసూల్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

కనిమెట్టలో..

మండల పరిధిలోని కనిమెట్టలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం 9వ వర్ధంతిని గ్రామస్తులు, యువకులు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి నాగరాజు, ఉపాధ్యాయులు లక్ష్మయ్య, గాదం పరమేష్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

వనపర్తిటౌన్: అధికారం సమాజ శ్రేయస్సుకు వెచ్చించాలనే రాజ్యాంగ స్ఫూర్తికి ఏపీజే అబ్దుల్ కలాం ప్రాణం పోశారని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో శనివారం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం 9వ వర్ధంతిని టీజేఏసీ జరుపుకొన్నారు. ఈ మేరకు అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కవులు గిరిరాజాచారి, నరసింహ శర్మ, దేవన్న నాయుడు, బండలయ్య పాల్గొన్నారు.



వనపర్తిలో అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కవులు, నాయకులు

పావలా వడ్డీ నిధులు మంజూరు చేయాలి



పాన్‌గల్: మహిళ సంఘాల సభ్యులకు పెండింగ్‌లోని పావలా వడ్డీ నిధులు వెంటనే మంజూరు చేసి, సంఘాల బలోపేతానికి తోడ్పాటునందించాలని సంఘం సభ్యులు కోరారు. శనివారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో గ్రామసంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడారు. మహిళ సంఘాలకు వడ్డీలేని రుణాలు ఇవ్వాలని, సంఘం సభ్యులకు ఉపాధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని, గ్రామ సంఘానికి ప్రత్యేక భవనం మంజూరు చేయాలని, తండాను పెంట్లవెల్లి ఆంధ్రాబ్యాంకు నుంచి కేతేపల్లి ఎస్‌బీఐ బ్యాంక్‌కు మార్చాలని ఏకగ్రీవంగా సమావేశంలో తీర్మానం చేశారు. ఆయా సమస్యలను జిల్లా అధికారులకు నివేదిస్తామని సంఘం అధ్యక్షురాలు చిట్టిమ్మ పేర్కొన్నారు. సమావేశంలో గ్రామసంఘం కార్యదర్శి శాంతమ్మ, సాలమ్మ, అనిత, పద్మ పాల్గొన్నారు.

హామీలు ఇచ్చి బడ్జెట్ కేటాయించకపోవడం దారుణం

అమరచింత: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం దారుణమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ అన్నారు. అనేక సంక్షేమ రంగాలకు కేటాయించిన బడ్జెట్‌పై వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న ఉపాధి పనిదినాలు 100 నుంచి 150కి పెంచుతామని, రోజు కూలీ రూ.400 చెల్లిస్తామని, భూమిలేని వ్యవసాయ కార్మికులకు ఏడాదికి రూ.12,000 భరోసా అందిస్తామని బడ్జెట్‌లో రూ.902 కోట్లు మాత్రమే వెచ్చించడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజా పాలనలో భూమిలేని పేదలు పెట్టుకున్న దరఖాస్తుల ఆధారంగా నిధులు పెంచాలన్నారు. ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున, రాష్ట్ర వ్యాప్తంగా 4.50లక్షల ఇళ్ల నిర్మాణాలకు రూ.22,500 కోట్లు అవసరం ఉండగా.. ఈ బడ్జెట్‌లో కేవలం రూ.8,424 కోట్లు కేటాయించడం ఏమాత్రం సరిపోవన్నారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలని, లేకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాగరాజు, శేఖర్, హన్మంతు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న లక్ష్మణ్‌నాయక్

పాన్‌గల్: మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం నాణ్యతగా అందించాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ వంట ఏజెన్సీలకు సూచించారు. శనివారం మండలంలోని జమ్మాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం రావాలని, విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారి సామర్థ్యాలను పెంచాలన్నారు. ప్రతి నిత్యం హెచ్ఎంలు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తూ.. మెనూ ప్రకారం నాణ్యతగా అందిస్తున్నారా లేదా అనే విషయాలను పరిశీలించాలన్నారు. పాఠశాల హెచ్ఎం వీరశేఖరచారి, సీఆర్పీ గోవింద్ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

అమరచింత: ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు ప్రభుత్వ పరంగా అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు లేవని, దీంతో విద్యార్థులు ఆహారం తీసుకోలేకపోతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ మెనూ ప్రకారం కూరగాయలను వినియోగించడం లేదని, రోజూ సాంబార్‌ను మాత్రమే అందించడం ఏమిటని ప్రశ్నించారు. పాఠశాలలోని తరగతి గదులు అపరిశుభ్రంగా ఉన్నాయని, దీంతో చెట్లకింద కూర్చొని భోజనం చేయాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాఠశాలలో నెలకొన్న సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించాలని కోరారు. లేకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.